## క్లుప్తంగా

### వచ్చే నెల 11 వరకూ గడువు

సామర్లకోట: పదో తరగతి విద్యార్థులు వచ్చే నెల 11వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని ఎంఈఓ వై.శివరామ కృష్ణయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో నవంబరు 16 తేదీ వరకూ, రూ.200 అపరాధ రుసుంతో నవంబరు 22 వరకూ, రూ.500 అపరాధ రుసుంతో నవంబరు 30 వరకూ ఫీజు చెల్లించవచ్చన్నారు.

### భారీ అన్నదానం



వీర్రాఘవపురంలో నిర్వహిస్తున్న అన్నదానం

సామర్లకోట: స్థానిక వీర్రాఘవపురంలో నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా 11వ వార్డు కౌన్సిలర్ నమ్మి దుర్గ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం ఏర్పాటు చేశారు. సుమారు 3 వేల మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నేతల హరిబాబు, స్వయంభారపు వీరభద్రరావు, మాజీ కౌన్సిలర్ గంగిరెడ్డి కృష్ణమూర్తి, మాగాపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన పెంచుకోవాలి




విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న పెద్దాపురం జూనియర్ సివిల్ జడ్జి బుల్లెమ్మ

సామర్లకోట: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని పెద్దాపురం జూనియర్ సివిల్ జడ్జి జి.బుల్లెమ్మ అన్నారు. శనివారం స్థానిక భాష్యం స్కూల్‌లో విద్యార్థులకు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ప్రతీ భారతీయ పౌరుడు ప్రాథమిక విధులు, ప్రాథమిక హక్కులతో పాటు ప్రాథమిక చట్టాలపైనా అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులకు బాల్య వివాహాలు, బాల కార్మిక చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో భాష్యం ప్రిన్సిపాల్ సూర్య, ఉపాధ్యాయులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

### పంచారామ క్షేత్రం మూసివేత



ఆలయ ప్రధాన ద్వారాన్ని మూసివేసిన పండితులు, సిబ్బంది

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామభీమేశ్వరస్వామి ఆలయాన్ని చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకుని ఆలయ అభిషేక పండితులు వేమూరి సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 4 గంటలకు మూసివేశారు. ఆదివారం ఉదయం ఆలయాన్ని శుభ్రం చేసి సంప్రోక్షణ అనంతరం ఉదయం 9 గంటల తరువాత భక్తులకు దర్శనానికి అవకాశం కల్పించనున్నారు.

### పారిశుధ్యం అధ్వానం



ప్రధాన రహదారిలో పూడుకుపోయిన డ్రైన్

కొత్తపల్లి: కొండెవరం గ్రామంలో అడుగువేయాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఎక్కడ చూసినా పెంటకుప్పలు దర్శనమిస్తున్నాయి. కాలువలు పూడుకుపోయి మురుగునీరు రోడ్లపైకి ప్రవహిస్తోంది. పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిఠాపురం–ఉప్పాడ రహదారిలో ప్రధాన కాలువలు సైతం పూడుకుపోయాయి.

### నా భూమి - నా దేశం పనుల పరిశీలన



తాటిపర్తిలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏపీడీ వసంత మాధవి

పిఠాపురం: గొల్లప్రోలు మండలంలో నిర్వహించిన నా భూమి నా దేశం పనులను ఏపీడీ వసంత మాధవి శనివారం పరిశీలించారు. మండలంలో చిన జగ్గంపేట, తాటిపర్తి తదితర గ్రామాల్లో చెరువుల అభివృద్ధి పనులను పరిశీలించిన ఆమె రికార్డులను తనిఖీ చేశారు. అనుమతులు ఇచ్చిన పనులు ఎంత వరకు నిర్వహించారు, ఇంకా ఎన్ని పనులు జరగాల్సి ఉంది తదతర విషయాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది ఉన్నారు.

# పట్టణ ప్రణాళికా విభాగం ఉన్నట్టా.. లేనట్టా..!

- అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించిన సభ్యులు
- వాడీవేడిగా పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



కౌన్సిల్ సమావేశంలో అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్ రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ తులసీ మంగతాయారు(ఇన్‌సెట్‌లో)

పెద్దాపురం: పట్టణంలో టౌన్ ప్లానింగ్ విభాగం ఉన్నట్టా.. లేనట్టా..? టీపీఓ బదిలీ జరిగితే సిబ్బంది కరవయ్యారా..? ఉన్న సిబ్బందితో పని చేయించకుండా మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టడమే మీ నిర్ణయమా..? అంటూ మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు నిలదీశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు అధ్యక్షతన శనివారం జరిగిన పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఆద్యంతం వాడీవేడిగా సాగింది. ప్రధానంగా పట్టణ ప్రణాళిక విభాగంలో నెలకొన్న లోపాలపై సభ్యులంతా విరుచుకుపడ్డారు. సమావేశంలో కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, విడదాసరి రాజా, ఆకుల కృష్ణ బాపూజీ, ఆరెళ్లి వీర్రాఘవులు మాట్లాడుతూ పట్టణంలో ఎన్నో భవన నిర్మాణాలు, అనధికార లేఅవుట్‌లో ఉన్నా వాటిపై పర్యవేక్షణ కొరవడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు నెలల క్రితం టీపీఓ బదిలీ అయ్యాక టీపీఎస్‌గా వచ్చిన ఉద్యోగిని మళ్ళీ కాకినాడ డిప్యూటేషన్‌పై సరెండర య్యారన్నారు. అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో పట్టణ ప్రణాళిక విభాగంలో పనులు ముందుకు సాగక మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు. పట్టణంలో అనేక చోట్ల మున్సిపల్ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు. రెవెన్యూ సిబ్బందికి సచివాలయ ఉద్యోగులపై పర్యవేక్షణ లోపించిందని, సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీనిపై అధికారులు పూర్తి దృష్టి సారించాలని కోరారు. ఉన్న సిబ్బంది సేవలు వినియోగించుకుని మున్సిపల్ ఆదాయాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కౌన్సిలర్ రాజశేఖర్ మాట్లాడుతూ మెయిన్‌రోడ్డులో అంజనేయ స్వామి గుడి వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో మరింత చొరవ చూపాలన్నారు. కౌన్సిలర్ త్సలికి సత్య భాస్కర్ మాట్లాడుతూ రెండో విడత టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు సత్వరమే అందించాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణంలో ఎక్కడా మున్సిపల్ స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా స్థలాలను గుర్తించి వాటికి రక్షణ కల్పించాలని చైర్‌పర్సన్ తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ సాయి ప్రసాద్‌లు ఆదేశించారు. అనంతరం పలు అంశాలపై చర్చ సాగింది. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి, కమిషనర్ జంపా సురేంద్ర,, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, డీఈఈ ఆదినారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, ఆర్ఓ చంద్రశేఖరం, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు షేక్ రఫీ, వాసంశెట్టి గంగ, కౌన్సిలర్లు సయ్యద్ అమీనాబీబీ, పేరిండెట్టి అంబిక, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నాణ్యమైన వైద్య సేవలే ప్రభుత్వ లక్ష్యం

**ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు**



జగనన్న సురక్ష కిట్లను అందజేస్తున్న ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు

పెద్దాపురం: రాష్ట్రంలో ప్రతీఒక్కరికి నాణ్యమైన వైద్య సేవలే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని జె.తిమ్మాపురం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి సుబాని అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత హౌసింగ్ చైర్మన్ దొరబాబు రిబ్బన్ కట్ చేసి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఇంటింటికీ వెళ్ళి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వైద్య సేవలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, నల్లల గోవిందు, గోలి రామారావు, పెంటా విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. నవర గ్రామంలో శనివారం గ్రామ సర్పంచ్ దమ్మాల లక్ష్మణరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం శిబిరంలో పరీక్షలు చేయించుకున్న రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిశెట్టి అమృత, ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, వైస్ ఎంపీపీలు పేర్నిడి వెంకట్రాయుడు, ములసా శ్రీను, ఎంఈఓ–2 పి.పుల్లయ్య, ఎంపీటీసీ సభ్యుడు కేశవరపు ప్రభాకరరావు, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, ఎలిశెట్టి నరేష్, ఎంపీడీఓ డి.శ్రీలలిత తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణులకు కార్పొరేట్ వైద్యం

**ఎంపీడీఓ వెంకట నారాయణ**



కొత్తపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్‌ను అందిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణులకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారని ఎంపీడీఓ వి.వెంకట నారాయణ అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. మహానేత డాక్టర్ వైఎస్సార్ హయాంలో ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు మంచి జరిగితే ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీతో పాటు, ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజా ఆరోగ్యానికి జీవనం పోశారన్నారు. అవసమైన వారికి బీపీ, షుగర్, ఇతర రక్త పరీక్షలు చేసి మందులు ఉచితగా పంపిణీ చేశారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ పర్యవేక్షణలో 560 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ స్టాల్‌ను ఏర్పాటుచేశారు. సచివాలయాల కన్వీనర్ సానా నాగు, కార్యదర్శులు శ్రీనివాస్, సత్యనారాయణ వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## ప్రజల వద్దకే వైద్య సదుపాయం

**ఎమ్మెల్యే పెండెం దొరబాబు**



పి.దొంతమూరు శిబిరంలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ప్రజలందరికీ సమానంగా వైద్యం అందాలనే జగనన్న ఆరోగ్య సురక్ష తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. శనివారం నియోజకవర్గంలో పలు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలపై వైద్యాధికారులతో ఆయన సమీక్షించారు. పిఠాపురం మండలంలోని పి.దొంతమూరులో వైద్య శిబిరాన్ని పరిశీలించిన ఆయన వైద్య సేవలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఆధునిక వైద్య సదుపాయాలను ప్రజల ముంగిటకు తీసుకురావడానికే ప్రభుత్వం ఈ శిబిరాలను నిర్వహిస్తోందన్నారు. ప్రతీ గ్రామం, పట్టణంలో ప్రతి వీధిలో ఈ కార్యక్రమం 45 రోజుల పాటు జరుగుతుందని, ఎవరికి ఏ ఆరోగ్య సమస్య ఉన్నా ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నియోజకవర్గంలో ప్రతీ రోజు నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలపై ఆరా తీశారు.

## భక్తిశ్రద్ధలతో దుర్గమ్మ సంబరం



అమ్మవారికి పూజలు చేస్తున్న అయ్యరక కార్పొరేషన్ చైర్మన్ ఆవాల రాజేశ్వరి, లక్ష్మీనారాయణ తదితరులు

సామర్లకోట: స్థానిక పాత్రుళ్ల వీధిలో శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం అమ్మవారిని అలంకరించి ప్రత్యేక వాహనంపై ఊరేగించారు. రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్మన్ ఆవాల రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ అమ్మవారికి పూజలు చేసి సంబరాన్ని ప్రారంభించారు. భారీ ఎత్తున బాణసంచా కాల్పులు, మ్యూజికల్ బ్యాండ్, పులి వేషాలు, గరగ నృత్యం, వివిధ సాంస్కృతిక ప్రదర్శనల మధ్య సంబరం ఉత్సాహంగా సాగింది. పాత్రుళ్ల వీధి నుంచి వేంకటేశ్వర స్వామి ఆలయం, చంద్రశేఖరస్వామి ఆలయం, పాత తహసీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం మీదుగా పంచారామ క్షేత్రం ముఖద్వారం వరకూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని గోదావరి కాలువలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యురాలు కర్రి వెంకటలక్ష్మి, కర్రి రామకృష్ణ, పెదిరెడ్ల కృష్ణ, బడుగు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అమరజీవుల త్యాగాలు వెలకట్టలేనివి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ లతాకుమారి

పెద్దాపురం: సమాజంలో అమరజీవుల త్యాగాలు వెలకట్టలేనివని పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి అన్నారు. అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక రోటరీ క్లబ్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ లతాకుమారి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ పాత్ర కీలకమైనదన్నారు. సమాజం కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమర వీరుల త్యాగాలకు జోహార్లు అన్నారు. శిబిరంలో సుమారు 120 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన సిబ్బందిని డీఎస్పీ లతాకుమారి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పెద్దాపురం సీఐ అబ్దుల్ రవికుమార్, సామర్లకోట సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ వెలుగుల సురేష్, ట్రాఫిక్ ఏఎస్ఐ రత్నం తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి మహర్షి ధన్యజీవి



వాల్మీకి జయంతి ఉత్సవంలో నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లు

పెద్దాపురం: రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి ధన్యజీవని పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు మాట్లాడుతూ వాల్మీకి రామాయణం నిత్య జీవన పారాయణమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, కౌన్సిలర్లు త్సలిక సత్యభాస్కర్, విడదాసరి రాజా, ఆరెళ్ళి వీర్రాఘవులు, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

## సత్యదేవుని ఆలయం మూసివేత



లోవ దేవస్థానంలో తలుపులమ్మతల్లి ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకులు

అన్నవరం: చంద్ర గ్రహణం సందర్భంగా అన్నవరం వీరవేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయాన్ని శనివారం మూసి వేశారు. సాయంత్రం 5 గంటలకు అర్చకులు స్వామివారికి పూజలు చేసి ఆలయ తలుపులు మూసివేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలోకి రాకుండా తూర్పు, పశ్చిమ రాజగోపురాల తలుపులు కూడా మూసి వేశారు. అలాగే రత్నగిరిపై రామాలయం, వనదుర్గ, కనకదుర్గ ఆలయాలను మూసివేశారు. సత్యదేవుని వ్రతాలు సాయంత్రం నాలుగు గంటలు లోపు నిర్వహించారు. ఆదివారం ఉదయం ఐదు గంటలకు ఆలయాన్ని తెరిచి సంప్రోక్షణ చేస్తామని ఆలయ ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి స్వామివారి దర్శనాలకు భక్తులను అనుమతిస్తామని అధికారులు తెలిపారు.

**తలుపులమ్మ ఆలయం మూసివేత**

తుని రూరల్: చంద్ర గ్రహణం సందర్భంగా లోవ దేవస్థానంలోని తలుపులమ్మ అమ్మవారి ఆలయాన్ని శనివారం మూసి వేశారు. పండితులు సాయంత్రం 5 గంటలకు కవాటబంధనం చేశారు. గ్రహణం అనంతరం ఆదివారం ఉదయం ఏడు గంటలకు ఆలయాన్ని తెరుస్తామన్నారు. సంప్రోక్షణ నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిస్తామని అధికారులు తెలిపారు.

## రైతులకు మంచి సూచనలివ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మునిరత్నం

పెద్దాపురం: ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ఆఖరి దశలో రైతులకు శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు మంచి సలహాలు, సూచనలు అందజేయాలని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి.మునిరత్నం అన్నారు. శనివారం స్థానిక ఏరువాక కేంద్రంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యవసాయాధికారులకు శిక్షణ, సందర్శన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరువాక కో–ఆర్డినేటర్ సీహెచ్‌వీ నరసింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మునిరత్నం మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్‌లో తక్కువ వర్షపాతం నమోదు కావడం వల్ల వరి, అపరాల పంటల్లో నీటి కొరత లేకుండా చూడాలన్నారు. వరిలో అక్కడక్కడ ఎండాకు తెగులు, సుడిదోమ ఆశించే అవకాశం ఉన్నందున రైతులను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారులు విజయ్‌కుమార్, హరి, జ్యోతిర్మయి, శాస్త్రవేత్తలు నందకిషోర్, శర్మ, సుధీర్, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత రక్తదాన శిబిరం



తునిలో రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: యువత రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణదానం చేయవచ్చని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం తుని పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ గీతా రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని చైర్‌పర్సన్ సుధారాణి ప్రారంభించారు. స్థానిక పోలీసులతో పాటు పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు రక్తదానం చేశారు. దాతల నుంచి సేకరించిన రక్తాన్ని రెడ్ క్రాస్‌కు అందజేస్తామని తుని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, డాక్టర్ స్వప్న తెలిపారు. వైఎస్సార్ సీపీ యువిజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, కౌన్సిలర్లు, విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎస్ఈబీ దాడుల్లో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పరిధిలోని గ్రామాల్లో శనివారం నిర్వహించిన దాడుల్లో 20 లీటర్ల సారాతో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి. అశోక్ తెలిపారు. కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి, తామరాడ గ్రామాల్లో సారా స్థావరాలపై దాడులు నిర్వహించి, సారా తయారీకి సిద్ధం చేసిన 100 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. సంఘటన స్థలం నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. గెద్దనాపల్లికి చెందిన సుందరపల్లి శ్రీనుపై పరారీ కేసు నమోదు చేశారు. తామరాడలో చక్రవర్తుల గోపాలస్వామిని అదుపులోకి తీసుకున్నారు. ఏలేశ్వరం మండలం సిరిపురంలో 10 లీటర్ల సారాతో ఒనం లోవరాజును అరెస్టు చేసినట్టు సీఐ వివరించారు. ఈ దాడుల్లో స్థానిక ఎస్ఈబీ ఎస్సై బి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ప్రమాణ స్వీకారం

గోకవరం: మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం శనివారం ఘనంగా జరిగింది. వీరలంకపల్లిలోని రామకృష్ణాగార్డెన్స్‌లో సంఘ గౌరవాధ్యక్షులుగా బాలు, గంధం బుజ్జి, గౌరవ సలహాదారులుగా తోలేటి రాంప్రసాద్, పల్లెల కొండలరావు, మండలాధ్యక్షుడిగా నన్నపు శాంతిబాబు, వైస్ ప్రెసిడెంట్‌గా శివ, సెక్రటరీగా చిన్న లావయ్య, ట్రెజరర్‌గా దుర్గ, జాయింట్ సెక్రటరీగా రతనరాజు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శాంతిబాబు మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీను పాల్గొన్నారు.

### చెకుముకి సంబరాల పోస్టర్ల ఆవిష్కరణ



చెకుముకి సంబరాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జన విజ్ఞాన వేదిక నాయకులు

పిఠాపురం: మండలంలోని గొల్లప్రోలు ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓలు ఎస్.వెంకటేశ్వరరావు, శివప్రసాద్, ఎంపీడీఓ శర్మ, జన విజ్ఞాన వేదిక గొల్లప్రోలు శాఖ అధ్యక్షుడు ఏలేటి నానిబాబులు చేతుల మీదుగా చెకుముకి సైన్సు సంబరాల పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. వచ్చే నెల 10వ తేదీ నుంచి పాఠశాల స్థాయిలో, 30న మండల స్థాయిలో, డిసెంబర్ 17న జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు దాడి పద్మనాభం, కన్వీనర్ సీతారామరాజులు తెలిపారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు సీహెచ్‌ఆర్ మంగతాయారు, రామిశెట్టి నూకరాజు, సూర్యచంద్ర, రామసుధ పాల్గొన్నారు.

### రైతు భరోసా కేంద్రాల్లో జాబితాల ప్రదర్శన

సామర్లకోట: మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో ఈ–క్రాప్, ఈకేవైసీ నమోదుచేసుకున్న రైతుల వివరాల జాబితాలను ప్రదర్శనకు ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి ఐ.సత్య తెలిపారు. ఈ మేరకు అచ్చంపేట రైతు భరోసా కేంద్రంలో ఈ లిస్టులను కాకినాడ ఏడీఏ జీవీ పద్మశ్రీ శనివారం సాయంత్రం పరిశీలించారు. రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన లిస్టుల్లో అభ్యంతరాలుంటే ఈ నెల 30వ తేదీలోగా వీఏఏలకు తెలియజేయాలన్నారు.

### అవినీతి రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్ సంతోష్‌కుమార్

సామర్లకోట: అవినీతి రహిత సమాజ నిర్మాణానికి విద్యార్థి దశ నుంచే కృషి చేయాలని ఉండూరు యూనియన్ బ్యాంకు మేనేజరు సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఉండూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బ్యాంకుల విజిలెన్సు అవగాహన వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కూర్మారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పాఠశాల పరిశీలన

ప్రత్తిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం సాయంత్రం కాకినాడ జిల్లా సీఎంఓ చామంతి నాగేశ్వరరావు సందర్శించారు. పాఠశాలలోని టాబ్, లాబ్‌ల వినియోగంపై విద్యార్థులను ఆరా తీశారు. ఎంత సేపు వినియోగిస్తున్నారు, టాబ్, లాబ్ వల్ల ఉపయోగం తదితర విషయాలపై ఆయన విద్యార్థులతో చర్చించారు. ఆపై కొన్ని ప్రశ్నలు సంధించారు. విద్యార్థుల నుంచి స్పష్టమైన సమాధానాలు రావడంతో సీఎంఓ చామంతి నాగేశ్వరరావు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు, ప్రధానోపాధ్యాయుడు టీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

తుని: వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తుని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ స్వప్న శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫార్మసిస్ట్ గ్రేడ్ 1, గ్రేడ్ 2, ఆడియోమెట్రీషన్ -1, ల్యాబ్ అకౌంటెంట్-1 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### అనూష యాదవ్‌కు డాక్టరేట్

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెందిన దేవర అనూష యాదవ్‌కు డాక్టరేట్ లభించింది. పాండిచ్చేరిలోని పీపుల్ ఫోరమ్ అఫ్ ఇండియా భారత్ సేవక్ సమాజ్ సంస్థ ఆమెకు గౌరవ డాక్టరేట్‌ను అందజేసింది. ప్రపంచ వ్యాప్తంగా భారత దేశం, బంగ్లాదేశ్, మయన్మార్, శ్రీలంక, సింగపూర్, మలేషియా దేశాలకు చెందిన సోషల్ లీడర్స్‌కు గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేశారు. సోషల్ సర్వీస్ విభాగంలో అనూషయాదవ్ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఆమెను సినీ నటులు లక్ష్మీనారాయణ, విజయమోహన్ తదితరులు అభినందించారు.

### ఓటే వజ్రాయుధం



శంఖవరంలో బీఎల్ఓలకు సూచనలిస్తున్న తహసీల్దార్ సుబ్రహ్మణ్యం

శంఖవరం: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని తహసీల్దార్ కె.సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వీఆర్వోలు, బీఎల్ఓలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 9 తేదీ వరకూ కొత్త ఓట్ల నమోదుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందన్నారు. 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. బీఎల్ఓలు ఇంటింటా సర్వే చేసి ఓటు నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీటీ శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.